క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణం

వీరఘట్టం: మండలంలోని కిమ్మిలో నాగావళి నదీ తీరంలో కొలువుదీరిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్తీక నాలుగో సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది.

విత్తనాలు పంపిణీ



రైతులకు మినుము విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురంలో ఇరవై మంది రైతులకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అందజేసిన సంచుల్లో టెన్ వీబీఎన్–8 రకం మినుము విత్తనాలు నాలుగు కిలోల చొప్పున ఉన్నాయి. అరెకరాకు ఈ విత్తనాలు సరిపోతాయని ఏఓ జక్కువ సౌజన్య తెలిపారు.

పొట్టేళ్ల పందాలపై దాడులు



పట్టుకున్న పొట్టేళ్లతో ఎస్సై కళాధర్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామ శివారులో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై సోమవారం తెల్లవారుజామున ఎస్సై జి.కళాధర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు రెండు పొట్టేళ్లు, రూ.1220 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు.

అష్టలక్ష్మీ యాగ్రం ప్రారంభం



యాగశాలలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు

భామిని: మండలంలోని ఘనసరలో గల మదన కామేశ్వరీస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అష్టలక్ష్మీ యాగం ప్రారంభమైంది. ఆలయ పురోహితుడు గుడిమెట్ల శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో బత్తిలి పురోహితులు రంపా లలిత ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం యాగాన్ని ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు యాగం నిర్వహిస్తామని చెప్పారు. అంతకుముందు మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


పాలకొండ: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్య, పారిశుధ్యం, తదితర సమస్యలపై వినతులు అందాయని ఆయన తెలిపారు.

ఎటుచూసినా వనభో'జనాలే'..!



కార్తీకమాసం.. అందులోనూ సోమవారం.. ఎటుచూసినా వనభోజనాల సందడే కనిపించింది. చాలామంది తమ పిల్లాపాపలతో సరదాగా పిక్నిక్‌లకు వెళ్లి, సరదాగా గడిపారు. గరుగుబిల్లి మండలంలోని పెద్దూరు తోటల్లో పలువురు చేసుకున్న పిక్నిక్ వేడుకను తలపించింది. సాయంత్రం అంత్యాక్షరి, మిఠాయిపాట్లాం, ఖోఖో, రాముడు–సీత చీటీల ఆట ఆడి, ఆనందంగా గడిపారు. –గరుగుబిల్లి

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థి ఆరోగ్యం పరిశీలిస్తున్న వైద్యురాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్యాధికారి ఎం.శృతి కలిసి ప్రతీ విద్యార్థి ఆరోగ్యం పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, ఏఎన్‌ఎంలు పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం ఎఫెక్ట్..

ఆందోళనలో అన్నదాత



కోతలు పూర్తి చేసిన వరి పంటను కుప్పలు పెడుతున్న వైనం

- జిల్లాలో 75 వేల ఎకరాల్లో పూర్తయిన వరి కోతలు
- బలమైన గాలులు, భారీ వర్షాలు పడితే తప్పని నష్టం
- జిల్లాపై పెద్దగా ప్రమాదం ఉండదంటున్న అధికారులు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో రైతులు కొంత మేర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిధిలో దాదాపు 75 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తికావడం.. వీలైనంతవరకు ప్రైవేట్ వర్తకులకు విక్రయాలు కూడా చేపడుతున్నారు. ఇంకా చాలా ఎకరాల్లో కోతలు పూర్తి కాలేదు. ఈ తరుణంలో వాతావరణ శాఖ సూచనలు కాస్త ఆందోళనకు గురిచేస్తున్నాయి. కీలక దశలో భారీ వర్షాలు, గాలులు వీస్తే చేతికి అందిన వరి పంట నష్టపోవాల్సివస్తుందని ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో నీరు నిలిచి, గాలిలో తేమశాతం పెరగడం వల్ల పూత రాలడం, పెరుగుదల కుంటుపడటంతో పాటు దిగుబడిలో నాణ్యత కూడా లోపిస్తుంది. చీడపీడల ఉధృతి పెరుగుతుంది. భూమిలోని పోషకాలు సరిగా మొక్కలకు అందక ఎదుగుదల ఆగిపోతుంది. విత్తనాలు మొలకెత్తకుండా కుళ్లిపోయే అవకాశం ఉంది. మరోవైపు 80 వేల ఎకరాల్లో అపరాల సాగుకు సమాయత్తమైన రైతులు వరుణిడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. సాగుకు సంబంధించి సకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని వ్యసాయశాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి స్పష్టం చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా.....

- వీలైనంత త్వరగా చేలల్లో అధికంగా ఉన్న నీటిని తీసివేయాలి.
- పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ డోస్ ఎరువులను వేసుకోవాలి.
- అధిక తేమ వల్ల ఉధృతి పెరిగే అవకాశం గల తెగుళ్లు, పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి.
- వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపు తొలగించుకోవాలి.
- నేల కొంచెం ఆరిన తర్వాతే రసాయన ఎరువులను నేలలో వేసుకోవాలి.



వాతావరణ ప్రభావంతో దిగుబడి దక్కించుకునే పనిలో అన్నదాతలు

వరిపంటలో..

- వరిలో పాము పొడ తెగులు నివారణకు లీటర్ నీటిలో హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా ప్రొపికొనజోల్ మిల్లీ లీటర్ కలిపి పిచికారీ చేయాలి.
- అగ్గి తెగులు తట్టుకోలేని బీపీటీ 5204 లేదా జేజీఎల్ 384 రకాలకు తుఫాన్ వర్షాలు వెలిసిన తర్వాత ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రొ థయొలేన్ 1.5 మిల్లీలు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పడిపోయిన కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టాలి. గింజ మొలకెత్తకుండా రంగు మారకుండా లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

పత్తి పంటలో.....

- వర్షాలు తగ్గగానే, వీలైనంత త్వరగా, మురుగు నీరు తొలగించి అంతర కృషి చేసి, నేల ఆరబెట్టాలి.
- అధిక తేమ వల్ల మొక్కలు భూమి నుంచి పోషకాలను గ్రహించే స్థితిలో ఉండవు. అలాంటి పరిస్థితుల్లో మొక్కలు ఎర్రబడటం, వడలిపోవడం, ఎండిపోవడం జరుగుతుంది. దీని నివారణకు 2% (120 గ్రా) యూరియా లేదా 2% (20 గ్రా) పొటాషియం నైట్రేట్ 1% (10 గ్రా) మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి 5–7 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి.



- నల్లమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి 2–3 పర్యాయాలు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 1 ఎం.ఎల్ ప్రొపికొనజోల్ లేదా గ్రాము కాప్టాన్+, ప్రొపికొనజోల్ లీటర్ నీటిలో కలిపి 2–3 పర్యాయాలు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

వేరుశనగలో...

వేరుశనగలో ఆకుమచ్చ, కాండం కుళ్లు తెగులు ఉధృతి పెరగకుండా హెక్సాకొనజోల్ 2 ఎం.ఎల్/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- ఇనుము లోపాన్ని సవరించడానికి ఫెర్రోసల్ఫేట్ 5 గ్రాములను లీటర్ నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలి. అలాగే లీటర్ నీటిలో గ్రాము సిట్రిక్ యాసిడ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

కూరగాయ పంటల్లో...

- పొలంలో నిలిచిన నీటిని తీసివేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలను కూడా పిచికారీ చేసుకోవాలి.
- నీటిని తీసివేశాక లీటర్ నీటిలో ఐదు గ్రాములు 130 – 45 ఎరువును కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. ఇనుప ధాతు లోపం నివారణకు లీటర్ నీటిలో ఐదు గ్రాముల ఫెర్రోసల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

పూల తోటల్లో......

- మొక్కలపై 2% యూరియా లేదా 1% 13–0–45 ను వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 ఎం.ఎల్‌ను లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 1 ,2 సార్లు పిచికారీ చేయాలి.
- కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. పువ్వులను కోసిన తర్వాత, మార్కెట్‌కు పంపేలోపు వాటిని తాత్కాలికంగా బాగా గాలి, వెలుతురు వచ్చే ప్రదేశంలో నిల్వ చేయాలి.

లింగ వివక్ష నిర్మూలించాలి

భామిని: సమాజంలో లింగ వివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణి, సీడీపీఓ శాంతిభవానీ అన్నారు. ఈ మేరకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మహిళా సంఘాల సభ్యులు సోమవారం మండల కేంద్రంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

సమానత్వం పాటించాలి..

గుమ్మలక్ష్మీపురం: స్త్రీ, పురుషులనే లింగ భేదాలు చూపకుండా సమానత్వం పాటించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం కోరారు. కళాశాలలో జెండర్(లింగ) ఆధారిత హింసకు వ్యతిరేకంగా నినదించే కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, వారిలో ఏ ఒక్కరినీ తక్కువ అంచనా వేయకూడదని, తక్కువగా చూడకూడదన్నారు. అనంతరం మహిళా సాధికారత సెల్ అధ్యాపకురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో స్త్రీ, పురుషులు సమానమేనని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపలు కుమారి, స్వరూప, తులసి, శాంత తదితరులు పాల్గొన్నారు.




నినాదాలు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కొమరాడ: స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు శివయ్య మాట్లాడుతూ స్త్రీ, పురుషులిద్దరినీ సమానంగా చూడాలని, వారిలో ఏ ఒక్కరూ తక్కువ కాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, వెలుగు ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో ఏర్పడిన భారీ గోతులను తప్పించబోయి ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు దూసుకుపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పెద్దదిమిలి మీదుగా భామిని వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులున్నారు. డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించడంతో ఎవ్వరికీ ఎటువంటి దెబ్బలు తగల్లేదు.



పెద్ద దిమిలి వద్ద రోడ్డు పక్కన మట్టిలోకి దూసుకు వెళ్లిన ఆర్టీసీ బస్సు

జీవితాలు నాశనం చేసుకోవద్దు..

పాలకొండ రూరల్: యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్స్, మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో ఏర్పడే ఆరోగ్య సమస్యలు, కేసుల్లో చిక్కుంటే ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు.

నేడు సోషల్ ఆడిట్ ప్రజావేదిక

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో 2023–24 ఆర్థిక సంవత్సరం పనుల్లో చేసిన పనులు, వాటికి జరిగిన నగదు చెల్లింపులపై చర్చించడం జరుగుతుందన్నారు.

అన్నసమారాధన

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కైలాసనాథస్వామి ఆలయంలో అన్నసమారాధన సోమవారం చేపట్టారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులతో పాటు పట్టణ వాసులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

శివోహం..



గరుగుబిల్లి: గొట్టివలస శివాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని, ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పరమ పవిత్రంగా భావించే ఈ మాసంలో సోమవారాల్లో పూజలకు భక్తులు అత్యంత ప్రాధాన్యమిస్తారు. వేకువజాము నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తజనం.. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని మనసారా దైవదర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. భక్తుల హరహర మహాదేవ.. శంభో శంకర.. శంభో శివ శంభో.. శివోహం.. నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్: ప్రత్యేక అలంకరణలో శివలింగం



కొమరాడ: పాలేం గ్రామ శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు

ఓవర్ లోడ్‌తో అవస్థలు..



మండలంలో ఉండేవి ఇరుకురోడ్లు కావడం .. దీనికితోడు అధిక లోడులతో ట్రాక్టర్లు రాకపోకలు సాగించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు..

చలివేంద్రి, కిమ్మి రోడ్లు మీదుగా చెరకు ట్రాక్టర్లు ఓవర్ లోడ్‌తో రాకపోలు సాగంచడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. చెరకు ట్రాక్టర్లకు ఉండే తొట్టెలను తీసి, నిబంధనలకు విరుద్ధంగా పెద్దవి ఏర్పాటు చేయడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదు. చలివేంద్రి నుంచి చెరకు లోడుతో వస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. – వీరఘట్టం

హెల్మెట్ లేనిదే ప్రవేశం లేదు..



హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ఆడలి వ్యూ పాయింట్‌కు ప్రవేశం లేదని ఎస్సై వై. అమ్మన్నరావు స్పష్టం చేశారు. ఈ మేరకు కిట్టాలపాడు, కుశిమి, శంభాం జంక్షన్, తదితర చోట్ల నో హెల్మెట్ – నో ఎంట్రీ అన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. – సీతంపేట

సంఘీభావం ..



ఆరు రోజులుగా ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) నాయకుడు ఎం.భాస్కరరావు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.గణేష్, ఎస్.మోహనరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు బి.ఉమామహేశ్వరరావు, బి.రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. –సీతంపేట

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువు

వీరఘట్టం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువైంది. కనీం ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జి. కళాధర్ పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అక్కడా ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఎంపీడీఓ తెలిపారు.



అర్జీదారుల కోసం వేచి చూస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై కళాధర్

మత్స్యకారులు ఆర్థికంగా బలపడాలి

పాలకొండ: మత్సకారులు ఆర్థికంగా బలోపేతం కావాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని తుమరాడ గ్రామంలోని కామినాయుడు చెరువులో సోమవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా మత్సకారులకు పూర్తి రాయితీతో చేప పిల్లలు అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యశాఖాధికారి డి. గోపీకృష్ణ మాట్లాడుతూ.. పలు రకాలకు చెందిన 40 వేల చేపపిల్లలను అందించినట్లు చెప్పారు.



చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, తదితరులు

విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ మృతికి సంతాపం

పాలకొండ : పట్టణంలోని వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాల విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ దుప్పాడ భారతి మృతికి విద్యార్థులు సోమవారం సంతాపం తెలిపారు. సీతంపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రార్థనా సమయంలో మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతికలగాలని ప్రార్థించారు. హెచ్‌ఎం పరాంకుశంనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

సీతంపేట: నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) నాయకుడు భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటా 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నారు. అన్ని రంగాల కార్మికులకు ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. వైద్యరంగం ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు.



ర్యాలీ చేస్తున్న గిరిజనులు

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

భామిని: మండల వ్యాప్తంగా దాదాపు ఐదు వేల ఎకరాల్లో పత్తి పండిస్తున్న రైతులు దిగుబడిని విక్రయించుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. ఈమేరకు రైతు సంఘాల నాయకులు గురుబిల్లి వెంకట లక్ష్మీపతినాయుడు, కొత్తకోట బాబురావు నాయుడు, పత్తి రైతులతో కలసి సోమవారం స్థానిక తహసీల్దార్ అప్పారావును కలిశారు. మండలకేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు, పత్తి రైతులు

ఆకట్టుకున్న లక్ష దీపారాధన



పవిత్ర కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని, గరుగుబిల్లి మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు చేపట్టిన లక్ష దీపారాధన ఆకట్టుకుంది. గరుగుబిల్లి, హిక్కింవలస, ఉద్దవోలు, రావుపల్లి, పెద్దూరు, పార్వతీపురం, వీరఘట్టం తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. మనసారా భగవన్నామస్మరణ చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. -గరుగుబిల్లి